

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## సోమశిల జలాశయానికి 14వేల క్యూసెక్కుల వరదనీరు



**అనంతసాగరం, ఆగస్ట్26ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి సోమవారం సాయంత్రానికి 14.905క్యూసెక్కుల వంతున నీరు వచ్చి చేరుతోంది. దీంతో 32.55 టిఎంసిలకు నీటి మట్టం చేరుకుంది. జలాశయం నుంచి దిగువకు ఎస్ఎఫ్సి కెనాల్‌కు 5క్యూసెక్కులు, పెన్నా డెల్టాకు 550క్యూసెక్కులు , కండలేరు వరద కాలువకు 2వేల క్యూసెక్కుల వంతున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయం లో 92.281 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# తప్పు లెక్కలు చూపించే వారిపై కఠిన చర్యలు

## సిజిఎస్‌టి కమిషనర్ ఆనంద్ కుమార్



నెల్లూరు క్రైం, ఆగస్టు 26, ప్రభాతవార్తప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల విషయంలో తప్పు లెక్కలు చూపించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సిజిఎస్‌టిఏపీ వింగ్ కమిషనర్ పి. ఆనంద్ కుమార్ స్పష్టం చేశారు. నెల్లూరు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ టాక్స్ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కమిషనర్ ఛాంబర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు దుకాణాల్లో కొన్న ప్రతి ఒక్క వస్తువుకి తప్పకుండా బిల్లును తీసుకోవాలన్నారు. పన్నుల మీద పన్ను కట్టకుండా సులభతరంగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను చెల్లించే విధానమే జిఎస్టి పన్ను విధానం అని వివరించారు. దేశంలో మౌలిక సదుపాయాలు, పేదల ఆర్థిక పరిపుష్టి కల్పనలో జిఎస్టి పన్ను కీలక పాత్ర వహిస్తోందని తెలిపారు. ప్రపంచంలో మూడు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడంలో జిఎస్టి పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పన్నులు చెల్లించని వారిపై, తప్పు లేక్కలు చూపే సంస్థలపై ఆడిటింగ్ నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆరు నెలలుగా ఈ అంబులెన్స్ నిరుపయోగం




## ఆరు నెలలుగా ఈ అంబులెన్స్ నిరుపయోగం

**కోవూరు , ఆగస్టు 26 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పశు సంరక్షణకు గానూ గత సంవత్సరం కోట్లాది రూపాయలు వ్యయం చేసి సంచార పశు ఆరోగ్య సేవలు పాడి పశువులకు అందించేందుకు గానూ అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రెంగు అంబు లెన్స్‌లను ఈ పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేశారు. ప్రతి అంబులెన్స్‌లో ఒక డ్రైవర్, ఒక డాక్టర్, ఒక కాంపౌండర్‌ను వీటి కోసం ఏర్పాటు చేయడం జరిగింది. దీంతో పాటు ప్రతి నెల సుమారు రూ. 40 వేలు విలువ చేసే పశువులకు సంబంధించిన మందులు కూఆ అందజేసేలా ప్రణాళికలు రూపొందించారు. నెలకు సుమారు లక్ష రూపాయలకు పైగా విలువ చేసే మందులు, జీతాలు, డీజిల్ కోసం ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. అంతవరకు భాగానే ఉన్నా జిల్లాలోని ప్రధానంగా డెల్టా ప్రాంతమైన కోవూరు నియోజ కవర్గంలో పాడి పశువుల అభివృద్ధి మిగతా నియోజకవర్గాల కంటే అధికంగా ఉన్నాయి. అయితే ఈ పశువుల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లు వారికి ఏ మాత్రం ఉపయోగపడు తున్న దాఖలాలు లేవు. కోవూరు నియోజకవర్గానికి సంబంధించిన ఇందుకూరుపేట, కోవూరు మండలాల్లోని పశువైద్యశాలల్లో పాడి పశువుల ఆరోగ్య పరిరక్షణ కొరకు రెండు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఈ రెండు మండలాల్లో ఏ ప్రాంతంలో నైనా పాడి పశువులకు అనారోగ్యం సోకితే 1962 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇస్తే వెంటనే ఈ అంబులెన్స్ ఆ ఫోన్ చేసిన ప్రాంతానికి చేరుకుని తగు వైద్యసేవలు అందిస్తుంది. ఒకవేళ అక్కడ వీలు కాకపోతే ఆ పశువును అంబులెన్స్ ద్వారా పశు వైద్యశాలకు తీసుకువచ్చి ఇక్కడ సీనియర్ పశువైద్యుల ఆధ్వర్యంలో చికిత్సలు చేసే పరిస్థితి ఉంది. అంతవరకు బాగానే ఉన్నా నియోజకవర్గంలోని ఈ రెండు మండలాల్లో గతంలో కూడా ఈ అంబులెన్స్‌కు డ్రైవర్ లేకపోవడంతో ఈ వాహనాలు నెలల పాటు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ప్రస్తుతం ఇందుకూరుపేట అంబులెన్స్‌కు డ్రైవర్ ఉన్నాడు. కోవూరులోని అంబులెన్స్‌కు గత నెలలుగా డ్రైవర్ లేకపోవడంతో ఈ ప్రాంత పశువులకు అంబులెన్స్ సేవలు అందని ద్రాక్షలా మారిపోయాయి.

**- మందులు పక్కదారిలో..** ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఆశించిన మేర లేకపోవడంతో ప్రతి అంబులెన్స్‌కు ప్రతి నెలా సుమారు రూ. 40 వేలు విలువ చేసే మందులను అందిస్తున్నారు. అయితే గత నెలలుగా అంబులెన్స్ సేవలు లేకపోవంతో వచ్చిన ఈ విలువైన మందులు పక్కదారిన పడ్డాయా.. లేక ఎక్కడ ఉన్నాయి అనే విషయమై ఈ ప్రాంత రైతులు దోలాయమానంలో పడి ఉన్నారు. కోవూరు అంబులెన్స్‌లో గత నెలలుగా డ్రైవర్ లేకపోవడంతో ఉన్న డాక్టర్‌కు కాంపౌండర్‌కు నెలకు 52వేలకు పైగా జీతాల రూపంలోనే చెల్లిస్తున్నారు. ముఖ్యంగా ఈ అంబులెన్స్‌పై పశువైద్యశాఖకు సంబంధించిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఆశించిన మేర లేకపోవడంతో గతంలో కూడా కోవూరు అంబులెన్స్‌కు సంబంధించిన మందులు కావాలి, తదితర ప్రాంతాల్లో అమ్ముకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. అసలు ఏ నాడు కూడా ఈ అంబులెన్స్‌పై పశు సంవర్ధక శాఖ ఆసించిన మేర తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. ప్రతి నెల వస్తున్న ఈ విలువైన మందులు పాడి రైతులకు ఇస్తున్నారా.. లేక అమ్ముకుంటున్నా అనే ప్రశ్నలు పాడి రైతులుల్లో వినవస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు ఈ పశు అంబులెన్స్‌నూ పూర్తి స్థాయిలో అనరేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. గత నెలలుగా కోవూరు అంబులెన్స్‌కు డ్రైవర్ లేని విషయమై సంబంధిత అంబులెన్స్ ఏజెన్సీ ఇన్‌చార్జిని ప్రభావతవార్త వివరణ కోరగా.. ఎన్నిసార్లు డ్రైవర్ ఇంటర్వ్యూలు నిర్వహించినా ఎవరూ హాజరు కాలేదని చెప్పడం గమనార్హం. ఈ నెలల పాటు మందులు ఏమయ్యాయని అడడగా.. పంపుతున్నామని ఒక సారి, ఇందుకూరుపేట మండలానికి పంపుతున్నామని మరోసారి చెప్పడం కొసమెరుపు.

# అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌లో ఎక్కువ కానున్న పొగాకు దిగుబడులు

## పొగాకు బోర్డు సెక్రటరీ వేణుగోపాల్



**మర్రిపాడు, ఆగస్ట్26ప్రభాతవార్త:** అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌లో రానున్న రోజుల్లో పొగాకు దిగు బ డులు అధికమయ్యే సూచనలు కన్పిస్తున్నాయని భారత పొగాకు బోర్డు ఇన్‌చార్జ్ సెక్రటరీ డి.వేణుగోపాల్ పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా డిసిపల్లి పొగాకు వేలంకేంద్రంలో ఆయన ఒంగోలు రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావుతో కలసి సోమవారం సందర్శించారు. అనంతరం పొగాకు వేలం ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో పొగాకు పండించే బ్రెజిల్, జింబాబ్వే వంటి దేశాల్లో ఈసారి పొగాకు సాగు గణనీయంగా పెరుగుతుందని , దీని మూలంగా పొగాకు దిగుబడి భారీ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ పొగాకు మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ తగ్గి ధరలు భారీ గా తగ్గే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర పొగాకు రైతాంగం ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని భారత పొగాకుబోర్డు అనుమతి ఇచ్చిన విస్తీర్ణం మేరకే పొగాకు సాగుచేయాలని రైతులకు సూచించారు. డిసిపల్లి పొగాకు వేలం కేంద్ర పరిధిలో ఈసీజన్‌లో 6.3మిలియన్ కిలోలకు పొగాకు బోర్డు అనుమతించగా రైతులు 10మిలియన్ల వరకు పొగాకు పండించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని వేలం కేంద్రాల పరిధిలో పొగాకు సాగు ఎక్కు వైందన్నారు. పొగాకు బ్యారన్లు , పొలం కౌలు అధిక ధరకు తీసుకొని పొగాకు సాగుచేయడం వలన రైతులు ఆశించిన ధరలు పొందలేరని వేణుగోపాల్ తెలి పారు. దీని వలన రైతులు పెట్టిన పెట్టుబడులు రాక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. 2024-25 పంటకాలానికి భారత పొగాకుబోర్డు అనుమతించిన మేరకు ఈప్రాంత రైతులకు ఒక్కో బ్యారన్‌కు 3.3 హెక్టార్లు, 4275కిలోల పొగాకును మంచి నాణ్యతతో పండించాలని ఆయన రైతులను కోరారు. పొగాకు బోర్డు పొగాకు రైతుల సంక్షేమానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఎటువంటి అపరాధరుసుము లేకుండా రైతులు అధిక పొగాకును పండించినప్పటికీ వేలం ప్రక్రియలో అమ్ముకోవడానికి అనుమతించారన్నారు. ఈకార్యక్రమంలో డిసిపల్లి పొగాకు వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.రాజశేఖర్, పొగాకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## నూనె ఆధ్వర్యంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**నెల్లూరు, ఆగస్టు26 ప్రభాతవార్త-విద్య** జనసేన పార్టీ కోర్‌కమిటి సభ్యులు నూనెమల్లిఖార్జున యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని స్థానిక ఆమణి గార్డెన్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా భారీ మండపాన్ని ఏర్పాటుచేసి అందులో శ్రీకృష్ణుని ప్రతిష్టించారు. మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీప కాంతుల్లో శ్రీకృష్ణుని దర్శించి పురవాసులు తరించారు. ఈ సందర్బంగా నూనె మల్లిఖార్జునయాదవ్ మాట్లాడుతు శ్రీకృష్ణుడు బోధించిన సారంశం ప్రతి ఒక్కరూ పాటించినప్పుడే సమాజం సుభిష్టంగా ఉం టుందన్నారు. హిందూ సనాతన ధర్మాన్ని పాఠించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం ఆయన పుర వాసులకు , బందుమిత్రులకు కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, గుర్రంకిషోర్‌బాబు, ప్రసాద్, ఏటూరి రవి కుమార్, మార్కెట్ సురేష్, నాగర్నతం, భవాని నాయుడు, కవిత, మురళీరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# తాగునీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన



**కావలి, ఆగస్టు 26 ప్రభాతవార్త** రెండు నెలల నుండి తాగునీరు సరఫరా లేకపోవడంతో చెడిపోయిన బోరు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కావలి సిపియం పార్టీ ఆధ్వర్యంలో కావలి పట్టణ 36వ వార్డు చెరువుకట్ట గిరిజన సంఘంలో చెడిపోయిన బోరు వద్ద మహిళలు ఖాళీ బిందెలు పెట్టి నిరసన నినాదాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్బంగా సిపియం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. చెరువు కట్ట గిరిజన సంఘంలో వంద కుటుంబాలకు పైబడి నిరుపేదలు నివసిస్తున్నారన్నారు. ఎక్కువ మంది ఈ బోరు నుండి వచ్చే మంచినీటిని తీసుకొని కాలం గడుపుతున్నారన్నారు. ఈ బోరు చెడిపోయి రెండు నెలలు కావస్తున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు మరమ్మతులు చేసి నీటి సరఫరా చేయకపోవడం చాలా విచారకరమన్నారు. ఇక్కడ నివసించే వారంతా నిత్యం కూలి పనులు చేసుకునే వారని తెలిపారు. రెండు నెలలుగా తాగునీటి కోసం తల్లడిల్లిపోతుంటే పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పేదలు నివసించే ప్రాంతాలలో అధికారులు సమస్యలు పరిష్కరించలేదనడానికి ఈ సమస్యే ఓ పెద్ద ఉదాహరణ అన్నారు.

ఇలాంటివి చాలా వున్నాయన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకొని చెడిపోయిన బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ పేదల కాలనీలో కొత్త బోర్లు వేసి నీటి కొరత లేకుండా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపియం నాయకులు బి.కృష్ణయ్య, మేడా వెంకటేశ్వర్లు, స్థానికులు మాలకొండస్వామి, తిరివీధుల ప్రసాద్, అరుణ, కోటేశ్వరి, రమణమ్మతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

# నగరంలో వ్యక్తి దారుణ హత్య






**నెల్లూరు క్రైం, ఆగస్టు 26, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులతో పాటు పోలీసులు తెలిపిన సమాచారం మేరకు స్థానిక రామలింగాపురంకు చెందిన కత్తి రవి (32) అనే వ్యక్తి పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఇటీవలే జైలు నుండి విడుదలయ్యాడు. అయితే ఇదే ప్రాంతానికి చెందిన కొద్ది మందితో ఇతనికి వైరుధ్యమ్ ఉంది. ఒకరి పై ఒకరుపై చేయి సాధించేందుకు గొడవలకు దిగుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రవి పై కత్తులతో విచక్షణ రహితంగా దాడికి దిగారు. తీవ్ర గాయాలు పాలైన అక్కడికక్కడే మరణించాడు. సంఘటనపై సమాచారం అందుకున్న బాలాజీ నగర్ పోలీస్ స్టేషన్ సిఐ సాంబశివరావు సంఘటన స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్డం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఏపీ హియరింగ్ హ్యాండి క్యాప్ట్ నెల్లూరు జిల్లా శాఖా అసోసియేషన్ నేటికి 8 సంవత్సరాలు పూర్తి




**నెల్లూరు అర్బన్, ఆగస్టు 26, ప్రభాతవార్త** ఐఆర్‌సిఎస్ బ్లడ్ బ్యాంకు నెల్లూరులో ఆంధ్రప్రదేశ్ హియరింగ్ హ్యాండి క్యాప్ట్ నెల్లూరు జిల్లా శాఖ అసోసియేషన్ ప్రారంభించి ఈ నాటికి 8 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వి. కుమార్ ఆధ్వర్యంలో వేడుక ఏర్పాటు చేసుకోవడం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు కుమార్ మాట్లాడుతూ బధిరులకు సంబంధించిన ఉద్యోగ పరమైన సమస్యలను జిల్లా, రాష్ట్ర ఏపీఎన్‌జీజీఓఎస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యలను పరిష్కరించుకొంటున్నామని ఈ సందర్భంగా తెలిపార. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు వి. వెంకటారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ. కన్న, సంయుక్త కార్యదర్శి గోపిచంద్, బధిరుల ఉద్యోగుల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మస్తానయ్య, టివీ గంగాధర తదితరులు పాల్గొన్నారు.

## బీద లక్ష్మానందకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ సేవా పురస్కారం



**కావలి, ఆగస్టు 26 ప్రభాతవార్త** కావలి డివిజన్‌లో విశేష సేవలందిస్తున్న ప్రముఖ రక్తదాన చైతన్యకర్త, లైఫ్ బ్లడ్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కావలి శాఖ సర్వ్ కన్వీనర్ బీద లక్ష్మానందకు విజయవాడకు చెందిన మథర్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ కలాం జాతీయ సేవా పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. రెండవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో జాతీయ సేవా పురస్కారం సంస్థ అధ్యక్షులు మల్లాది ప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. పురస్కార గ్రహీత లక్ష్మానంద మాట్లాడుతూ ఈ రోజు నేను అందుకున్న జాతీయ సేవా పురస్కారం నాకు తోడ్పాటునందించిన ప్రతి ఒక్క సేవా బృందంలోని సభ్యునికి, రెడ్‌క్రాస్ సభ్యులకు చెందుతుందని తెలిపారు. ఈ పురస్కారం వల్ల మరింత బాధ్యతలు పెరుగుతాయన్నారు. విజయవాడ మథర్ సర్వీసెస్ సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

## మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

**నెల్లూరు క్రైం, ఆగస్టు 26, ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా మైనింగ్ కార్యాలయాల్లో కొనసాగుతున్న సోదాల్లో భాగంగా నెల్లూరు మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల్లో పాల్గొన్న అధికారులు గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన అక్రమ మైనింగ్ గురించి ఆరా తీసారు. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో పలు దస్త్రాలను పరిశీలించారు. గత రెండు రోజులుగా ఈ సోదాలు జరుగుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో సోమవారం ఏసీబీ అధికారులు రికార్డులు తీసుకున్నట్లు సమాచారం, ముఖ్యంగా గూడూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో జరిగిన సిలికా, క్వార్ట్జ్ లోహాల గురించే ఎక్కు వగా దృష్టి సారించినట్లు తెలిసింది. ఈ సోదాల పై ఇటు మైనింగ్ శాఖ కానీ, అటు ఏసీబీ అధికారులు కానీ ఎటువంటి వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం, ఈ దాడుల్లో ఏసీబీ డిఎస్పి శిరీష, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## వేడుకగా కృష్ణాష్టమి వేడుకలు



**బుచ్చి ఆగష్టు 26 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని గిరిజాహాల్ ప్రాంగణంలో త్రైత సిద్ధాంతము వారి ఆద్వర్యంలో వేడుకగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. సద్గురు శ్రీశ్రీశ్రీ ప్రబోధనంద యోగీశ్వరులు ఆశీస్సులతో మొదటి రోజు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా స్వామి వారికి ఏర్పాటు చేసిన మండపంలో స్వామి వారిని ఉంచారు .ఉదయం స్వామి వారికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు గీతాపారాయణం, శృంగారహారతీతో, చిన్నపిల్లలకు గోపికలు కృష్ణుని వేషదారణలో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం చిన్నపిల్లలతో ఏర్పాటు చేసిన కోలాటం అకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు అందజేశారు. కార్యనిర్వాహకులుగా ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక వారు వ్యవహారించారు.

## కలిగిరి సిఐని కలిసిన టిడిపి నాయకులు



**వింజమూరు, ఆగస్ట్26ప్రభాతవార్త:** వింజమూరు తెలుగుదేశం నేతలు సోమవారం వింజమూరు పోలీస్‌స్టేషన్‌లో కలిగిరి సిఐ వెంకటరమణ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. కలిగిరి సర్కిల్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌ను ఖచ్చితంగా నిర్వహించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, మండల మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, నాయకులు కొండపల్లి వెంకటేశ్వర్లు, మంచాల శ్రీనివాసులునాయుడు, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన



**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త :** బోగోలు మండలం తాళ్ళూరు, బిట్రగుంట గ్రామాల్లో మంగళవారం రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం నుండి వచ్చిన వ్యవసాయ శాఖాధికారులు శైలజాకుమారి, మధురిమలు సేంద్రీయ వ్యవసాయాన్ని అమలు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారిణి ఎస్.విజయలక్ష్మి పాల్గొన్నారు.

## పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ ఎంపిక



**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త :** పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బోగోలు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా జి.రమేష్, కార్యదర్శిగా యం.శ్యామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యం.జాషువాలు ఎన్నుకోబడ్డారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు బెనహర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు

**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీ రామస్వామిపాళెంలోని శ్రీ విఘ్నేశ్వర రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 28 నుండి మూడు రోజుల పాటు జ్ఞానప్రసూనాంబ, కుమారస్వామి నవగ్రహాలు, జంట నాగులు,ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్స వాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తల రవిచంద్ర తెలిపారు. 30వ తేదిన విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో, శాంతి కళ్యాణంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి, కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డిలు పాల్గొంటారని కావున భక్తులు ఈ కార్యక్రమాలలో పాల్గొని శ్రీ స్వామి వారి, అమ్మవార్ల తీర్ధ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## పుట్టిన రోజు వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** పట్టణంలో పామూరు రోడ్డులోని లక్ష్మీ తిరుమల కళ్యాణ మండపంలో వేళ్ళ శ్రీనివాసులు నాయుడు, రమణమ్మ మనుమరాళ్ళు అక్షర, త్రినయినిల పుట్టిన రోజు వేడుకలు మంగళవారం జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సతీమణి సౌజన్య హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, ఇతర నాయకులు హాజరయ్యారు.

## నాయిబ్రాహ్మణ విద్యార్థులు ప్రతిభా అవార్డుల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి



**కందుకూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఉమ్మడి ప్రకాశం జిల్లా పేద నాయిబ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థుల జిల్లా ప్రతిభ అవార్డుల ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర నాయిబ్రాహ్మణ ఉద్యోగ సంఘం కార్యదర్శి కరేటి వెంకటేశ్వర్లు తెలిపారు. కందుకూరు పట్టణంలో మంగళవారం పాంప్లెట్ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరై నాయిబ్రాహ్మణ సేవా సంఘం నాయిబ్రాహ్మణ వృత్తి, కళాకారుల సంఘం, ఉద్యోగుల సంఘం ఆర్ఎంపీ పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొని పాంప్లెట్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వల్లూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తమవంతు చేయూత అందిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వల్లూరి కోటేశ్వరరావు ఫ్యామిలీ తరపున రూ.5వేలు ప్రకటించారు. అదే విధంగా పట్టణానికి చెందిన రియల్టర్ గోనుగుంట వేణు రూ.5116 అందించారు. అక్టోబర్ 6వ తేదీ ఆదివారం ఒంగోలులోని కాపు కళ్యాణ మండపంలో నిర్వహించే ప్రతిభా పురస్కారాలకు తమ యొక్క అప్లికేషన్‌లు ఒంగోలు నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న శ్రీ రాఘవ బుక్ డిపో నందు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయిబ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు పిల్లుట్ల సుధాకర్, నాయిబ్రాహ్మణ రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు నిడమానూరు యలమందరావు, జిల్లా ఆర్ఎంపీ పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు ద్రోణాదుల సింగయ్య, రిటైర్డ్ డిప్యూటీ విదాయశాఖ అధికారి మున్నంగి రాంబాబు, రాచపూడి శంకర్, కరేటి వెంకటేశ్వర్లు, కరేటి రాంబాబు, గోనుగుంట వేణు, వల్లూరు సాంబయ్య, జరుగుమల్లి మనోజ్, వెంకట ముని ప్రసాద్, కొచ్చర్ల మహేష్, కరేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకానికి సిద్దమైన వినాయక విగ్రహాలు





**ఉలవపాడు, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం చాగల్లు గ్రామంలో విఘ్నేశ్వరనుడి విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. సెప్టెంబర్ 7 వినాయక చవితి సందర్భంగా పందిళ్ల ఏర్పాటుకు అడుగు నుంచి 13 అడుగుల్లో ఉన్న వినాయకుడి విగ్రహాలను జాతీయ రహదారి పక్కన గల చాగల్లు గ్రామంలో సిద్దంగా ఉంచారు. అడుగు విగ్రహం రూ.1500 ఉండగా ఐదు అడుగులు రూ.8వేలు, 12 అడుగులు విగ్రహం రూ.20వేలకు పైగా చెబుతున్నారు. చదివి దగ్గరకు రావడంతో వీటిని కొనేందుకు వివిధ ప్రాంతాల వారు కావాల్సిన విగ్రహాలకు అడ్వాన్స్ ఇచ్చి కొనుక్కొని వెళ్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే రేట్లు భారీగా పెరిగాయని కొనుగోలు దారులు చెబుతున్నారు.

## బీజేపీ మండల స్థాయి సభ్యత్వ నమోదు



**ఇందుకూరుపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు కేఎస్ఆర్ పొలిటికల్ గెస్ట్‌హౌస్ దగ్గర్లో బీజేపీ మండల స్థాయి సభ్యత్వ నమోదు మీద సమావేశం జరిగింది. జిల్లా కార్యవర్గ సభ్యులు కైలాసం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ ఇందుకూరుపేట మండలంలో అన్ని గ్రామాల నుంచి నాయకులు కలిసి బీజేపీ సభ్యత్వం నమోదు చేయాలని ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మారుబోయిన శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, మైపాడు గాంధీ మండల అధ్యక్షుడు లేబూరు రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, శివ ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి మునగ చెట్టు కోటయ్య, కేత్‌రెడ్డి అవినాష్‌రెడ్డి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం

**ఇందుకూరుపేట, ఆగస్టు 27, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని పల్లెపాడు లో గనులు భూగర్భ శాఖ ఆధ్వర్యంలో 7 హెక్టార్ల లీజు స్థలంలో సంవత్సరానికి రూ.70వేలు క్యూబిక్ మిటర్లు సాధారణ ఇసుక మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణబుధవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ సెక్రటరీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయాలను సలహాలను సూచనలను అభ్యంతరాలను తెలియజేయవచ్చని ఆయన తెలియజేశారు.

## లింగసముద్రం ఎస్సైగా మహమ్మద్ సుభాని



**లింగసముద్రం(కందుకూరు), ఆగస్టు 27, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పరిధిలో పని చేస్తున్న 10 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా కందుకూరు నియోజకవర్గంలోని లింగసముద్రం ఎస్సై బాజీబాబును నెల్లూరు వీఆర్‌కు బదిలీ చేసి ఆయన స్థానంలో నెల్లూరు నగరంలో ఉన్న బాలాజీ నగర్ పోలీసు స్టేషన్ ఎస్సై షేక్ మహమ్మద్ సుభానిని నియమించారు. అదే విధంగా గుడ్లూరు ఎస్సైగా పని చేస్తున్న బి.లక్ష్మణరావును నెల్లూరు రూరల్ ఎస్సైగా బదిలీ చేశారు. అయితే గుడ్లూరు పోలీసు స్టేషన్‌కు ఇంకా ఎస్సైను నియమించలేదు.

## వైద్య విద్యార్థిని అత్యాచార ఘటన దారుణం




**వింజమూరు,ఆగస్ట్27ప్రభాతవార్త:** కలకత్తాలో జరిగిన వైద్యవిద్యార్థిని అత్యాచారాన్ని ఖండిస్తూ వింజమూరులో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు, కళాశాల విద్యార్థులతో కలసి బస్టాండు సెంటర్‌నుండి బంగ్లాసెంటర్ వరకు నిరసన వ్యక్తం చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువైందని , కళాశాలల్లో విద్యార్థులపైన , వైద్యశాలల్లో మహిళా వైద్యులపైన దారుణమైన సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయన్నారు. మహిళలపై జరిగే దాడులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకొని మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. స్వతంత్ర భారతదేశంలో మెడికల్ విద్యార్థిపై జరిగిన ఘటన అత్యంత దారుణమన్నారు. సంఘటన జరిగి ఇన్ని రోజులైనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని, ఇప్పటికైనా ప్రభుత్వం అత్యాచారంచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పొన్నూరు ప్రకాశం, పానుగంటి రమేష్, డి.వి.సురేష్ , ఎపి కంజ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధి చేబ్రోలు వసంతకుమార్, బిజెపి నాయకులు దేగా మధు, సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, డి.వి.సురేష్, ఆర్యవైశ్య సంఘ నాయకురాలు బిందు, కొండాసుధీర్, నారాయణ, కొండా సునీల్ , కొండా శివ, అనిల్, వెంకటేశ్వర్లు, ప్రవేటు కళాశాలల లెక్చరర్స్, విద్యార్థులు, జనసేన నాయకులు బండారు సత్య నారాయణ, అజయ్ శ్రీనివాసరావ్, గవ్వల వెంకి తదితరులు పాల్గొన్నారు.

## గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలి



**వింజమూరు,ఆగస్ట్27ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో నిర్మాణంలో ఉన్న గృహాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మంగళవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ , ఇతర నాయకులు హౌసింగ్ ఎఇ ఎస్.డి.ఫిరాన్‌ను కోరారు. గత ప్రభుత్వంలో వ్యక్తిగతంగా ఇంటి నిర్మాణాలను చేపట్టిన వారికి బిల్లులు మంజూరు చేయలేదని, కావున అధికారులు సమగ్ర విచారణ జరిపి ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకున్నవారికి బిల్లులు అందజేయాలనికోరారు.2014నుండి 2019వరకు ఇంటి నిర్మాణాల బిల్లులు కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందని , మండలంలో అర్హులను గుర్తించి వారందరికీ బిల్లులు వచ్చేలా మండల వ్యాప్తంగా 217 గృహనిర్మాణాలకు బిల్లులు చెల్లించాలని , వింజమూరు పంచాయతీలో 117గృహ నిర్మాణాలకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఈసందర్భంగా ఎఇ మా ట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలకల వెంకటరెడ్డి, ముంతా శ్రీనివాసులు, నీలం పెరుమాళ్ళు, తిరుపతాచారి , వర్క్ఇన్స్పెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## భూమిలో కార్బన్, నత్రజని నిష్పత్తి 10:1 గా ఉండాలి



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామా ల్లో ప్రస్తుం వరికోతలు ప్రారంభం కావడంతో మండలంలోని పాటూరు గ్రామంలో జరుగుతున్న వరికోతల కా ర్యక్రమాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి పరిశీ లించి రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరికోతలు యంత్రాల ద్వారా జరుగుతుందని, వరి దుబ్బులు ఒక అడుగు నుంచి ఒకటిన్నర అడుగు వరకు వదిలి కోస్తున్నారన్నారు. ఎక్కువ వరికొయ్య కాళ్లు భూమిలో కలియదున్నినప్పుడే భూమిలో ఉన్న కార్బన్, నత్రజని నిష్పత్తి 80:1గా ఉంటుందన్నారు. భూమిలోని కార్బన్, నత్రజని నిష్పత్తిని తగ్గించడానికి కొయ్య కాళ్లు భూమిలో కలియదున్నినప్పుడు పశువుల ఎరువు , పచ్చిరొట్ట పైర్లు పెంచి కలియదున్నేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేపచెక్క, ఆముదపు చెక్క, వేసుకుని నిష్పత్తిని 10:1గా తగ్గించవచ్చున్నారు. 10:1 ఉన్నప్పుడే అన్ని పోషకాలు లభ్యమై పైరుకు ఉప యోగపడి దిగుబడులు గణనీయంగా పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సీహెచ్ మౌనిక, రైతులు ఉన్నారు.

## ఈవ్‌టీజింగ్ చేసేవారిపై కఠిన చర్యలు



**కలిగిరి,ఆగష్టు27, ప్రభాతవార్త;** మండలంలో ఎక్కడైనా సరే మహిళలు, చిన్నారులు, విద్యార్థినిలుపట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందనికలిగిరి నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన యం ఉమాశంకర్ తెలిపారు.ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పిదప మంగళవారం విలేఖర్లతో మాట్లాడుతూ అన్నిపార్టీలరాజకీయనాయకులు, ప్రజలు పోలీసులతో కలసి సమన్వయంతో పనిచేసుకోవాల న్నా రు.పోలీసులు ప్రజలకు ఫ్రెడ్లీ పోలీస్‌గా పని చేస్తారన్నారు. ప్రజలకూగా పోలీసులకు సహకరించాలన్నారు.బెల్ట్‌షాపులు ,గంజాయివంటి మారక ద్రవ్యాలు అమ్మకాలు జరిగినట్లు సమాచారంవస్తే చర్యలు తప్పవన్నారు.విధ్యార్దులు యువతులపై అసబ్యకరంగా ప్రవర్తిస్తేతాట తీస్తామన్నారు. కలిగిరిలోని ట్రాపికన కంట్రోలు విషయంలో తగు చర్యతీసుకోవడం జరుగుతుందని ఉమాశంకర్ తెలిపారు.

## కొండబిట్రగుంటలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం వైఖానాస సాంప్రదాయ ప్రకారం శ్రీకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా గ్రామోత్స వం, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రావి ప్రభయ్య, రావి సుబ్బయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ వేడుకల్ని ఆలయ ఇవో అరవ రాధాకృష్ణ పర్యవేక్షించారు.

## అల్లూరులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



**అల్లూరు, ఆగస్టు 27 ప్రభాతవార్త** అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం వ్యవసాయాధికారులు శైలజకుమారి, మధురిమ, జెడి నాగరాజు, ఇన్‌చార్జ్ ఎవో శ్రీహరినారాయణలు నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు ఖర్చులు తగ్గడమే కాకుండా ఎరువలతో కూడిన ధాన్యాలు కాకుండా ఆరోగ్యకరమైన ధాన్యాన్ని పొందవచ్చునని తెలిపారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన ధాన్యాన్ని అందించిన వారవుతారన్నారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలుగా నవధాన్యాలను ఉపయోగించాలని వ్యవసాయ శాఖ ద్వారా ఈ విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. ఈ విత్తనాల ద్వారా నేల సారవంతమౌతుందన్నారు.రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ముందు వుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మేడా శ్రీనివాసులరెడ్డి, గుర్రం మల్లికార్జునరెడ్డి, కందల శివరామిరెడ్డి, చెంతాటి రాజశేఖర్‌బాబు, గుమ్మడి పొట్టెయ్య, కోడూరు వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా కృష్ణాష్టమి వేడుకలు



**ముత్తుకూరు, ఆగస్టు 27, ప్రభాతవార్త** ప్రపంచ వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని విసివై పార్టీ నాయకులు బోడె రామచంద్రయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ముత్తుకూరు మండలంలోని మల్లూరులో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వి. రామ్మోహన్ నాయుడు ఆయనకు ఘన స్వాగతం పలికారు. రామ్మోహన్ నాయుడు నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముడు జగత్ గురు అని ప్రతి ఒక్కరు భగవద్గీత చదవాలని ఆయన అన్నారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేవారని, ఇప్పుడు ఊరు వాడ తారతమ్యం లేకుండా ప్రతి చోట వేడుకలు నిర్వహిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేలో సవరణ కొరకు తహసిల్దార్‌కు వినతి



**అనంతసాగరం, ఆగస్ట్27 ప్రభాత వార్త:** మండలంలోని ఉప్పలపాడు లో ఇటీవల జరిగిన భూముల రీసర్వేలో తమ భూమి కొంత భాగం వేరే వ్యక్తుల పేర్త మీద మారి ఉందని విచారించి తమకు న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన వల్లూరు సూరిబాబు మంగళవారం తహసిల్దార్ వీరవసంతరావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ తాతల కాలం నాటి నుంచి తమ అనుభవంలో ఉన్న సర్వే నెంబర్ 326లోని 2.50ఎకరాల ప్రభుత్వ భూమి 1978లో తమ తండ్రి కీ.శే వల్లూరు మస్తానయ్య పేరు మీద ప్రభుత్వం పట్టా మంజూరు చేసిందని అదే భూమి అసైన్డ్ సర్వే లో 245-2ఊ,1.67ఎకరాలు గా ఖాతా నెంబర్ 148లో తప్పుగా ఎక్కించబడి ఉందన్నారు. ఆయన మరణానంతరం వీలునామా ప్రకారం వారసులుగా తమ అనుభవంలోనే ఉంటుందన్నారు. కానీ ఈ మధ్యకాలంలో జరిగిన భూమల రీసర్వేలో కూడా తమ పేరు మీదకు మార్చలేదని సర్వేయర్‌ను వివరణ కోరగా ఆ భూమిలో కొంత భాగం తుమ్మల గంగాధర్ ఖాతా నెంబర్ 279 అని ఉందని, 30సంవత్సరాల క్రితం పట్టా మంజూరు చేసినట్లు ఉందని సర్వేయర్ చెప్పారన్నారు. అసలు గంగాధర్ అనే వ్యక్తి మా గ్రామానికి చెందిన వాడు కాదని పట్టా మంజూరు చేసిన మూడు సంవత్సరాల లోపు ఆయన ఆ భూమిని సాగుచేయలేదని కావున ఆ పట్టాను రద్దుచేసి తమ తాతల కాలం నుంచి తమ అనుభవంలో ఉన్న భూమిని తమ పేరు మీదకు మార్చి న్యాయం చేయాలని తహసిల్దార్‌కు వివరించారు. తహసిల్దార్ విచారించి న్యాయమం చేస్తామన్నారని ఆయన తెలిపారు.

## చెమిడితోపాడు గ్రామంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**గుడ్లూరు(కందుకూరు), ఆగస్టు 27, ప్రభాతవార్త** గుడ్లూరు మండల చెమిడితోపాడు గ్రామంలో చిత్తారు నాగరాజు యాదవ్, యాదవ్ సోదరులు, గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి బ్రహ్మోత్స వం చేశారు. అనంతరం యువకులు ఉత్సాహంగా ఉట్టికొట్టు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో శ్రీకృష్ణుని ఊరేగింపు ఉత్స వం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సోదరులు, గ్రామ ప్రజలు పాల్గొని భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు.



# ముంగమూరు వద్ద అదుపు తప్పి కారు బోల్తా..
## టెలికాం ఇంజనీర్‌కు తీవ్ర గాయాలు




**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త** బోగోలు మండలం ముంగమూరు వద్ద మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటన జరిగింది. బిట్రగుంట పోలీసుల కథనం మేరకు ముంగమూరులో టెలికాం మరమ్మతులను పరిశీలించేందుకు కావలి సబ్ డివిజనల్ టెలికాం ఇంజనీర్ దువ్వూరు హరికృష్ణ, కారు డ్రైవర్ నాగరాజుతో పాటు రంగ య్య, జాషువ, సిబ్బందితో ముంగమూరు వెళ్తుండగా పిల్లివాగు సమీపంలో కారు అదుపు తప్పి బోల్తాపడిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో టెలికాం ఇంజనీర్ దువ్వూరు హరికృష్ణకు తీవ్ర గాయాలై పరిస్థితి ఆందోళనకరంగా వుండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలిం చారు. కారు డ్రైవర్ నాగరాజు, రంగయ్య, జాషువాలను చికిత్స నిమిత్తం కావలి వైద్యశాలకు తరలించార న్నారు. జాషువా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

# యుపిఎస్ పెన్షన్ స్కీమ్ పట్ల మజ్దూర్ యూనియన్ కార్మికుల సంబరాలు



**బిట్రగుంట, ఆగస్టు 27 ప్రభాతవార్త** బిట్రగుంట రైల్వే పిడబ్ల్యుఐ కార్యాలయం దగ్గర మంగళవారం కేంద్ర ప్రభుత్వం యుపిఎస్ పెన్షన్ విధానం నూతనంగా ప్రకటించిన మీదట కేక్‌ను కట్ చేసి సంబరాలు నిర్వహించారు. బిట్రగుంట రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మద్దిబోయిన శేఖర్ బాబు, సి.హెచ్.వెంకటేశ్వర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



**ఆత్మకూరు,.ఆగస్ట్27ప్రభాతవార్త:** ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రిలో 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా అంధత్వ నివారణా సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శర్వాణి ఆధ్వర్యంలో నేత్రదానం గురించి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రి మెడికల్ సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్రదానం చాలా గొప్పదని , ఒకరు చేసే నేత్రదానం ఇద్దరి జీవితాలకి వెలుగునిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ నేత్ర దానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎంఒ ఉషాసుందరి, ఫోరెన్సిక్ డాక్టర్ దత్తప్రసాద్ , డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేటినుండి పొగాకు బ్యారన్ల రిజిస్ట్రేషన్ ప్రారంభం

**మర్రిపాడు,ఆగస్ట్27ప్రభాతవార్త:** 2024-25 సంవత్సరానికి పొగాకు బ్యారన్ల రిజిస్ట్రేషన్ 28వ తేదీ నుండి ప్రారంభమవుతుందని డిసిపల్లి పొగాకు వేలం కేంద్ర నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కు ఆధార్ జెరాక్స్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్ కాపీ, పట్టాదారు పాస్‌బుక్ జెరాక్స్, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోలు 2 తీసుకురావాలని రాజశేఖర్ తెలిపారు. సాధారణ ఫీజు ఆగస్ట్ 28నుండి అక్టోబర్ 24వరకు , 100రూపాయల అపరాధ రుసుముతో అక్టోబర్ 25నుండి నవంబర్ 8వరకు, 400రూపాయల అపరాధ రుసుముతో నవంబర్ 9నుండి 20వ తేదీ వరకు చెల్లించి రిజి స్ట్రేషన్ చేయవచ్చన్నారు.కావున అందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని రాజశేఖర్ కోరారు.

# పారదర్శకంగా నమోదు చేపట్టాలి



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా నూతన నమోదు కార్యక్రమాన్ని పారదర్శకంగా చేపట్టేల బూత్ లెవల్ అధికారులు దృష్టి పెట్టాలని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కోవూరు మండలంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఈ నమోదు కార్యక్రమన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బీఎల్‌వో దీనికి సంబంధించి ఒక ప్రత్యేక రిజిస్టర్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరిశీలన సమయంలో ప్రతి ఇంటికి డోర్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలన్నారు. జీరో డోర్ నెంబర్ ఉండడానికి వీలు లేదన్నారు. ప్రజలు కూడా తమ ఇంటికి ఓటరు పరిశీలనకు వచ్చే బీఎల్‌వోలకు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రవి, బీఎల్‌వోలు ఉన్నారు.

# సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 1వ తేది నుంచి చేపట్టనున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతంగా చేసేలా సంబంధిత బూత్ ఇన్‌చార్జిలు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోవూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఐ. వెంకట రాఘవేంద్ర అన్నారు. కోవూరులోని రైల్వే ఫీడర్స్ రోడ్డులో ఉన్న గుర్రం రామయ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో కోవూరు నియోజకవర్గాన్ని జిల్లాకు ఆదర్శంగా ఉండేలా సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జిలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు సభ్యత్వ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి గాదిరాజు చక్రవర్తి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు నాటకరాణి జయచంద్ర, సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జిలు టి. బ్రహ్మేంద్ర, వి. బాలకృష్ణ, కె. మురళి, అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు ఉన్నారు.

# చంద్రబాబు నగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్
## సరైన పత్రాలు లేని 17 బైకులు, ఆటో స్వాధీనం



**నెల్లూరు క్రైం, ఆగస్టు 27, ప్రభాతవార్త** నెల్లూరు నగర శివారులలోని చంద్రబాబు నగర్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున ప్రత్యేక పోలీస్ బృందం ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డిఎస్పి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సిఐ, ఎస్ఐలతో పాటు ఇతర సిబ్బంది, స్పెషల్ పార్టీలతో కలిసి సుమారు 80 మందితో కూడిన పోలీసు బృందం చంద్రబాబు నగర్ పరిధిలోని 300 ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 17 బైకులను, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే ఏడు మంది రౌడీ షీటర్స్ ఇళ్లలో మరింత క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ కార్డ్ అండ్ సర్చ్‌కి సంబంధించిన వివరాలను ఎస్పి వెల్లడిస్తూ సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచటానికి ఈ కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతి భద్రతలను పరిరక్షణ, అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా తరచూ ఇటువంటి ఆపరేషన్స్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కఠిన ఆదేశాలు జారీ చేశామని, అతిక్రమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి అదుపులోకి తీసుకోవడం, వెండి, బంగారు వంటి చోరీ సొత్తు, అనుమానంగా ఉన్న రికార్డులు లేని అన్నీ వస్తువులు, వాహనాలు, అక్రమ మద్యం, ఆయుధాలు పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలు వాటిని గుర్తించి స్వాధీన పరుచుకోవడమని వివరించారు.

# జీవనోపాధి పొందేందుకు కుట్టుమిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయి



**కావలి రూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త** జీవనోపాధి పొందేందుకు కుట్టు మిషన్లు ఎంతో ఉపయోగపడతాయని కావలి ఒకటవ పట్టణ ఎస్ఐ జమావలిఖాన్ తెలిపారు. కావలి పట్టణంలోని శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టుమి షన్లను ఎస్ఐ జమావలి చేతుల మీ దుగా అందజేశారు. ఈ కార్యక్రమా నికి ఎస్ఐ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. పేద మహిళలకు ఉచితంగా శిక్షణనిస్తూ కుట్టు మిషన్లు కూడా అందజేస్తున్న శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు పొన్నగంటి మాధవిని అభినందించారు. భవిష్యత్‌లో పొన్నగంటి మాధవి మహిళలకు మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. గత ఆరు సంవత్సరాలుగా దాదాపు వెయ్యి మందికి శిక్షణ ఇవ్వడమే కాకుండా 500 మందికి పలువురి సౌజన్యంతో కుట్టు మిషన్లు అందజేయడం జరిగిందన్నారు. గతంలో ఫణీంద్ర సహకారంతో కూడా కుట్టు మిషన్లు అందజేయడం జరిగిందని గుర్తు చేసుకున్నారు. ఎస్ఐ జమావలి ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా సంతోషంగా వుందని శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి తెలిపారు.

# కుటుంబాలు బాగుపడాలంటే మహిళల ప్రాధాన్యత ఎక్కువ ఉండాలి



**కావలి రూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త** కుటుంబాలు బాగుపడాలంటే మహిళల ప్రాధాన్యత ఎక్కువగా వుండాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి ఎంపిడివో కార్యాల యంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొన డానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృ ష్ణారెడ్డి విచ్చేసిన సందర్భంగా అక్కడే వున్న పొదుపు మహిళా సమాఖ్య కార్యాలయానికి ఎపియం కాంతారావు అభ్యర్థన మేరకు వచ్చారు. భారీ కేక్‌ను కట్ చేసి పొదుపు మహిళలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. 1994వ సంవత్సరంలో ప్రస్తుత ముఖ్యమంత్రిగా వున్న నారా చంద్రబాబునాయుడు, అప్పటి నెల్లూరు జిల్లా కలెక్టర్ సాంబశిరావులు పొదుపు సంఘాలకు నాంది పలకడం జరిగిందన్నారు. సారాయి ఉద్యమానికి కూడా ఈ జిల్లాలోనే నాంది పలికారన్నారు. ఒకప్పుడు పొదుపు గ్రూపుకు 50 వేలు, లక్ష రూపాయలు ఇచ్చే వారని ప్రస్తుతం 20 లక్షల రూపాయలు ఒక్కో గ్రూపుకు ఇచ్చే స్థాయికి చేరుకోవడం జరిగిందన్నారు. ఈ సమాజంలో పది మంది ఒక గ్రూపుగా ఏర్పడి సంవత్సరాల తరబడి వుంటున్నారంటే మహిళల క్రమశిక్షణ, నిర్ణయాలు ఎంతో గొప్పవన్నారు. ఒకప్పుడు బ్యాంకు రుణాలు తీసుకున్నారంటే ఎగగొట్టేందుకు తీసుకుంటున్నారని అనుకునే వారని ప్రస్తుతం ప్రతి నెల క్రమం తప్పకుండా రుణాలు కడుతున్నారన్నారు. ఎంపిపి ఆలూరి కొండమ్మ, జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు, డిఎల్‌డివో విజయ్‌కుమార్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, టిడిపి నాయకులు నాయుడు రాంప్రసాద్, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు విద్యాసామాగ్రి పంపిణీ



**వింజమూరు,ఆగస్ట్27ప్రభాతవార్త:** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ పరిధిలోని మాధవనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం బాలకృష్ణా ఫ్యాన్స్ విద్యార్థులకు విద్యాసామాగ్రిని అందజేశారు. విద్యార్థులకు అవసరమైన నోట్‌పుస్తకాలు, పెన్సిల్స్, పెన్ను లనుబాలకృష్ణ ఫ్యాన్స్ నియోజ కవర్గ అధ్యక్షుడు షేక్ షరీఫ్, మండల అధ్యక్షుడు మాల్యాద్రి , విద్యాకమిటీ చైర్మెన్ కొండయ్య, మాదినేని రామకృష్ణ, శ్రీహరి, రమేష్ లు విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు.

# బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి



**వింజమూరు,ఆగస్ట్27ప్రభాతవార్త:** కావలి నుండి రాత్రి మయంలో ఉదయగిరి, ఆత్మకూరుకు వెళ్ళేందుకు బస్సు సౌకర్యం కల్పిం చాలని ఐపో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ లెక్కమనేని రాజేష్ మంగళ వారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అత్యధికశాతం మంది విద్యార్థులు గుంటూరు, విజయవాడ, కావలి తదితర ప్రాంతాల్లో విద్యనభ్య సిస్తుంటారని అనేక మంది వ్యాపారస్తులు కూడా బ్రతుకుదెరువుకొరకు వెళుతుంటారని కానీ రాత్రి 8.30గంటల సమయంలో కలిగిరి , వింజమూరు, ఉదయగిరి , ఆత్మకూరు వెళ్ళేందుకు ఎలాంటి ప్రభుత్వ రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రయాణీకులు రాత్రి సమయంలో కావలి బస్టాండులోనే ఉండిపోవాల్సి వస్తుందన్నారు. కావున ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వెంటనే బస్సు సౌకర్యం కల్పిం చేందుకు ఆర్టీసి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

# మోటారు సైకిళ్ల దొంగల అరెస్టు
## 15 మోటార్ సైకిళ్లు స్వాధీనం



**నెల్లూరు క్రైం, ఆగస్టు 27, ప్రభాతవార్త** జల్సాలకు అలవాటు పడి దొంగతనాల బాట పట్టిన ఇద్దరు మోటార్ సైకిల్ దొంగలను నెల్లూరు దర్గా మిట్ట పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 15 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పి కృష్ణకాంత్ మంగళవారం స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన కర్పూరం శివరామకృష్ణారెడ్డి స్థానిక బీవి నగర్‌కు చెందిన రవ్వ శ్రావణ్ కుమార్‌లు కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో ఆరు తాళాలు ఉపయోగించి మోటార్ సైకిల్‌లను దొంగతనం చేయసాగారు. నగరంలోని జరుగుతున్న మోటార్ సైకిల్ చోరీలకు సంబంధించి ఎస్పి ప్రత్యేక దృష్టి సారించి దర్గా మిట్ట సిఐ మందరోశయ్య నేతృత్వంలో ఇతర సిబ్బందితో కలిసి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దర్గామిట్ట స్టేషన్ పరిధిలోని శబరి శ్రీరామ క్షేత్రంలో వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 5.95 లక్షలు విలువ చేసే 15 మోటార్ సైకిల్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ చూపిన దర్గామిట్ట ఇన్స్పెక్టర్ మందా రోశయ్యను ఇతర సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

# ల్యాబ్ సేవలు పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** కోవూరు ని యోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధిం చిన పాడి రైతులు కోవూరులోని శాంతినగర్‌లో ఏర్పా టు చేసిన నియోజకవర్గ ప్రయోగశాల సేవలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని అన్నారు.కోవూరు లోని శాంతినగర్‌లో ఉన్న ప్రయోగశాలను మంగళ వారం ఆయన పరిశీలన చేపట్టారు. ఈ ల్యాబ్‌లో పశువుకు సంబంధించి పొదుగు వ్యాధి, నివారణకు సం బంధించి రక్తపరీక్షలు ఉచితంగా చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పశువులకు సంబంధించి లివర్ ఫంక్షనింగ్ టెస్ట్ , కిడ్నీ టెస్ట్, కాల్షియం, పాస్పరస్, పాలు, పశువుకు సంబంధించిన రక్త నమూనాల పరీక్ష లు కూడా ఈ ప్రయోగశాలలో ఉచితంగా రైతులకు సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు ఈ ప్రయోగశాలలో 5 వేల వరకు ల్యాబ్ పరీక్షలు కూడా చేయడం జరిగిందన్నారు. ఇదే పరీక్షలు పాడి రైతులు బయట ప్రయోగశాలలో చేయించుకోవాలంటే వందల నుంచి వేలాది రూపాయల వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రయోగశాలలో పాడి పశువుకు అందించిన అన్ని సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించు కోవాలన్నారు. ముఖ్యంగా పశువులకు సంబంధించి చర్మవ్యా ధులు , రక్తానికి సంబంధించి పారామీటర్స్, పూర్తి పరీక్షలు కూడా ఈ ల్యాబ్‌లో అందించడం జరుగుతుందన్నారు.కోవూరునియోజ కవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన పాడి రైతులు ఈ ప్రయో గశాలను సందర్శించి అవసరమైనసేవలను ఉచితంగా పొంద వచ్చన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ జయపాల్, దిలీప్, ఉన్నారు.

నెల్లూరు ప్రిన్సిపల్ జిల్లా జడ్జీ వారి కోర్టులో
I.A.No.461/2023
A.S.No. /2023
రాపూరు కొండయ్య ...పిటిషనరు/అప్పిలెంట్
Vs
1) రాపూరు మాలకొండారెడ్డి
2) ఐడి ప్రమీలమ్మ
...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్
1వ రెస్పాండెంట్‌కు నోటీసు
రాపూరు మాలకొండారెడ్డి తండ్రి చిన్న కొండారెడ్డి, వార్డు నెం.26/1, డోరు నెంబరు 13/469, భక్తవత్సల నగర్, నెల్లూరుసిటి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, పై నెంబరు గల కేసులో పిటిషనరు నెల్లూరు 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారు తే.30-01-2023దిన O.S.No. 62/2016 తీర్పు మీద అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 23 రోజులు ఆలస్యమును మన్నించమని కోరుచూ పిటిషను దాఖలు చేసి వున్నందున, సదరు పిటిషనులో 1వ రెస్పాండెంట్ నోటీసు నిమిత్తం తే.29-08-2024 దిన వాయిదా ఉన్నది. ఆ దినం ఉదయం 10.30 గంటలకు మీరు కానీ మీ తరఫున వకీలు గాని హాజరు కావలయును. లేని యెడల పై తేదిన పై కోర్టులో యుందు విషయమై మీ పరోక్షమున తీర్మానించబడును.
టి.వి.శ్రీనివాసరావు, B.Com., B.L.,
పిటిషనరు/అప్పిలెంట్ తరపు న్యాయవాది, నెల్లూరు

పాస్‌పోర్టు పోయినది
గొర్రెపాటి వెంకట రోహిత్ తండ్రి గొర్రెపాటి శోభన్‌బాబు, డో.నెం.9-25-601,జనతాపేట వర్డ్, కావలి,శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా. నాకు సంబంధించిన ఒరిజినల్ పాస్‌పోర్టు నెం: Z4185259, తేది 26.08.24న ఇంటి నుండి ఆఫీసుకు బైకు పై వెళుతుండగా మార్గ మధ్యంలో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబరుకు తెలియచేయగలరు.
సెల్ : 7842216904

# నేత్రాల పట్ల నిర్లక్ష్యం చేస్తే జీవితమే అంధకారం



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** విద్యార్థులు నేత్రాల పట్ల నిర్లక్ష్యం చేస్తే వారి భవిష్యత్తే అంధకారం అ య్యే పరిస్థితి వస్తుందని జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు పి. శ్రీహరి అన్నారు. కోవూరులోని జేబీఆర్ ప్రభుత్వ ఉన్న త పాఠశాల సమావేశ మందిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహ కారంతో విద్యార్థులకు నేత్ర పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తు తం కల్పించిన ఇటువంటి మంచి అవకాశాన్ని విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండు రోజుల పాటు ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి ఈ శిబిరాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని నివృతి చేసుకోవాలని ఆప్తమాలజిస్ట్ లక్ష్మీప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా 225 మంది బాల బాలికలకు పరీక్షలు నిర్వహించి అందులో 35 మందికి కంటి అద్దాలు అవసరమవుతాయని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆర్యో సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పీఈటీ సాయి ఉన్నారు.

# వైభవంగా అన్నదానం



**కోవూరు , ఆగస్టు 27 ప్రభా తవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో శ్రావణ మంగళవారం పర్వదినం సందర్భంగా సాయి భక్తుల సహకారంతో మెగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వ హించారు. చుట్టు పక్కల ప్రాం తాల నుంచి భక్తులు అధిక సం ఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకురాలు పచ్చిపాల సుజాత, భక్తులు ఉన్నారు.

**పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయి సేవా ట్రస్టు వితరణ** కోవూరు పట్టణంలోని 1వ సచివాలయానికి సంబంధించిన వలంటీర్‌గా పనిచేస్తున్న శ్రీవాణి భర్త సురేంద్ర మంగళవారం ఆకస్మికంగా మృతిచెందారు. ఈ మేరకు వారి అంత్యక్రియల నిమిత్తం పచ్చిపాల శంకర్‌రెడ్డి సాయి సేవా ట్రస్టు ద్వారా నిధులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా అనాథలు కులమతాలకు సంబంధం లేకుండా మృతిచెందితే వారి కుటుంబ సభ్యులకు తమ ట్రస్టు ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

# ఎఫ్ 1 పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి



**కోవూరు , ఆగస్టు 27 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధ వారం నుంచి నిర్వహించే ఎఫ్ 1 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిచేలా తగు చొరవ తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రహీమ్ అన్నారు. కోవూరులోని మండల ప్రాథమిక విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఆయన ఈ ఎఫ్ 1 పరీక్ష లకు సంబంధించి ప్రశ్నా పత్రాలు, ఓఎంఆర్ షీట్లపై సంబంధిత సీఆర్ఎంటీలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు ఈ ఎఫ్ 1 పరీక్షల ద్వారా వెల్లడవుతాయన్నారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఈ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేలా దృష్టి పెట్టాలన్నారు. సీఆర్ఎంటీలు ఎం. శ్రీనివాసులు, విష్ణుప్రసాద్, వనజ, హరీష్, హేమలతలు ఉన్నారు.

# చేజర్లలలో బిజెపి సభ్యత్వ నమోదు



**చేజర్ల ఆగష్టు 27 ప్రభాతవార్త** మండలకేంద్రమైన చేజర్ల బిజెపి కార్యాలయంలో మంగళవారం బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. చేజర్ల మండల బిజెపి అద్యక్షులు గుండాల విజయబాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల పదాధికారులు నాయకుల సమక్షంలో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో బిజెపి అద్యక్షులు మాట్లాడుతు బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని మండలంలోని అన్ని గ్రామాలలో నమోదు చేపించాలని సూచించారు. బిజెపి పార్టీ బలోపేతంకు నాయకులు,కార్యకర్తలు, కృషి చేయాలని అన్నారు బిజెపి జిల్లా ఉపాధ్యాక్షులు బత్తల కృష్ణయ్య,ఇన్‌చార్జి సిహెచ్ భరత్, వెంకటరామానాయుడు, భద్రయ్య,చిన్నారెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిజెపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి



**కావలి, ఆగస్టు 27 ప్రభా తవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలో ప్రతి బిజెపి కార్యకర్త విస్తృతంగా పర్యటించి బిజెపి సభ్యత్వ నమోదును విజ య వంతం చేయాలని బిజెపి రాష్ట్ర సహ కోశాధికారి కందు కూరి వెంకట సత్యనారాయణ పిలుపునిచ్చారు. కావలి నమస్కార్ సమావేశ మందిరంలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా సెప్టెంబరు 1వ తేది సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. పోలింగ్ బూత్ పరిధిలో సభ్యత్వ నమోదు ప్రక్రియపై కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు పార్టీ శ్రేణులకు పలు సూచనలు అందజేశారు. సభ్యత్వాల నమోదును మొబైల్ ఫోన్ ద్వారా 8800002024 నెంబరుకు మిస్ కాల్ ఇచ్చి నమోదు చేసుకోవచ్చునన్నారు. కావలి పట్టణంలోని ప్రతి బూత్ స్థాయిలో 200 మంది సభ్యత్వాలు చేయించాలన్న లక్ష్యంతో ముందుకు నడవాలన్నారు. ఈ సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు కుట్టుబోయిన బ్రహ్మానందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంచిపాక కమల, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వింతా రంగారెడ్డి, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, కావలి అసెంబ్లీ కన్వీనర్ సి.వి.సి.సత్యం, సభ్యత్వ నమోదు సహ ప్రముఖ్ బెల్లంకొండ మాల్యాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు పూనూరు మాధవిరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి మందా కిరణ్‌కుమార్, కూరాకుల సవీంద్ర, కోడూరు మురళి, సుందర్‌శెట్టి సుజి పాల్గొన్నారు.

## బదరీ విద్యార్దులకు బుక్స్,పండ్లు పంపిణి



**బుచ్చి ఆగష్టు 27 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం టౌన్‌లో ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో నిర్వహిస్తున్న బదరీ విద్యార్దుల పాఠశాలను ఉపాధ్యాయులు సిహెచ్.వి ఉమామహేశ్వరరావు ,పివికే ప్రసాదరావులు సందర్శించారు. విద్యార్దులు , అద్యాపకు లతో వివిధ అంశాలపై చర్చించారు. బదిర విద్యార్దులు విద్యాపరంగా మరియు జీవన పరంగా ఎదుర్కుంటున్న సమస్యలపై చర్చించారు. విద్యార్దులకు అందజేస్తున్నబోధనా విధానాలను తెలుసుకున్నారు. ఈ సందర్బంగా ఉపాధ్యాయులు ఉమామహేశ్వరరావు , ప్రసాదరావు విద్యార్దులకు మిఠాయిలు మరియు పండు పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్బంగా విద్యార్దులకు నోటిబుక్స్ పంపిణి చేయడం జరిగింది. ఈకార్యక్రమం గురించి పాఠశాల ప్రిన్సిఫల్‌ప్రకాష్, మాట్లాడుతు భదరీ విద్యార్దుల పట్ల ఉపాధ్యాయులు ప్రసాదరావు మరియు ఉమామహేశ్వరరావు ఆలోచన విధానం మరియు ప్రేవ ప్రశంసనీయమని కొనియాడారు. మునుముందు కూడా ఇలాంటి కార్యక్రమంలో బదరీల ప్రత్యేక పాఠశాల స్టాఫ్ కూడా పాల్గోనడం జరిగింది.

## పలువురికి ప్రశంసా పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, ఆగస్టు 27 ప్రభాతవార్త** టిడిపి యాప్‌ను అత్యధికంగా వినియోగించి సామాజిక మాధ్యమాలలో తెలుగుదేశం పార్టీకి విశేష ప్రచారం కల్పించిన పలు వురికి మంగళవారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా సంతకం చేసి పంపిన ప్రశంసా పత్రాలను కావలి టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అంబటి కిషోర్‌చౌదరి, ప్రళయకావేరి సాయిశివరాం, దేవరపాటి నాగేశ్వరరావు, కావలి జగన్మోహన్‌రావు, తటవర్తి సాయి చరణ్,పట్నంబాలకృష్ణ, నక్కలరవి, కంచర్లసీతారామయ్యలను ప్రశంసిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసా పత్రాలు పంపారు. ఈ ప్రశంసా పత్రాలను వారికి ఎమ్మెల్యే అందజేసి మాట్లాడారు. అలాగే కావలి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని కోరారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, పట్టణ కార్యదర్శి జ్యోతిబాబురావు, బొట్లగుంట శ్రీహరినాయుడు, తిరివీధి ప్రసాద్, తటవర్తి వాసు, సమ్మను వెంకట సుబ్బయ్య, టిడిపి, జనసేన నేతలు పాల్గొన్నారు.

## కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి



కావలి, ఆగస్టు 27 ప్రభాతవార్త కావలి పట్టణ పాతవూరులో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. పాత వూరుకు విచ్చేసిన ఆయనకు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. అశేష జనవాహిని మధ్య ఎమ్మెల్యే శ్రీకృష్ణ పరమాత్ముడ్ని దర్శించుకుని తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో వుండాలని ఆయన స్వామి వారిని ప్రార్దించారు.

## కావలి రైల్వే రోడ్డులో వైసిపి నేత ఆధీనంలో వున్న నిర్మాణాలు తొలగింపు



కావలి, ఆగస్టు 27 ప్రభాతవార్త కావలి పట్టణ రైల్వే రోడ్డులో వైసిపి నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కనమర్లపూడి వెంకట నారాయణ ఆధీనంలో వున్న షాపులను మంగళవారం మున్సిపల్ అధికారులు జెసిబితో తొలగించారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఈ నిర్మాణాల తొలగింపులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడు కనమర్లపూడి ఆధీనంలో వున్న షాపులు జెసిబితో తొలగించడంతో చర్చనీయాంశానికి దారితీసింది. ప్రభుత్వానికి సంబంధించిన స్థలంలో ఆక్రమించడంతో తొలగించినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

## వెంకయ్య స్వామి అలయ అభివృద్దికి కృషి

### ఈవో బాలసుబ్రహ్మణ్యం



**వెంకటాచలం 27 ప్రభాతవార్త** గొలగమూడి భగవాన్ వెంకయ్య స్వామి అలయ అభివృద్దికి విశేషంగా కృషి అలయాన్ని అభివృద్ది పదవంలో ముందుకు తీసుకోని వెళ్లడం జరిగిందని అలయ ఈవో బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. గొలగమూడిలో అశ్రములో మంగళవారం విలేకర్లు సమావేశము ఏర్పాటు చేసి మాట్లడారు. స్వామి వారి కుటుంబ సభ్యులు అన్ని చెప్పుకుంటున్న ఎవ్వరికి న్యాయస్దానాలు వారసత్వ హక్కులు కల్పించలేదన్నారు. ఆరాదాన ఉత్సవాల్లో మర్యాద పుర్వకంగా దర్శనం చేయించామన్నారు. 7 కోట్లు ఉన్న అస్తులను 200 కోట్లుకు పెంచామన్నారు. భక్తులకు ఉచితంగా విద్య, వైద్య సేవలు అందిసున్నామన్నారు. గొలగమూడిని షిర్డి తరహలో అభివృద్ది చేయడమే సంకల్పం అన్నారు. భగవాన్ వెంకయ్య స్వామి అలయంలో గత 18 సంవత్సరాల్లో ఏ ఒక్క రూపాయి అవనీతి జరినట్లు నిరూపిస్తే తను ఏ శిక్షకైనా సిద్దం అన్నారు. తన 60య ఏళ్ల ప్రభుత్వ ప్రవేట్ ,రంగాల ప్రస్దానంలో ఎక్కడైన అవనీతి జరినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్దంగా ఉన్నాన్నాన్ని పేర్కొన్నారు. తనకు తానుగా ఇక్కడికి రాలేదని, హైకోర్టు అదేశాలు మేరకు తను అశ్రములలలో పనిచేస్తున్నారు. అన్ని ప్రభుత్వ శాఖలదికారులు, అలయ కమిటి సభ్యులు ఉభయదాతలు భక్తుల సహయ సహకారాలతో వెంకయ్య స్వామి 42వ ఆరాదాన ఉత్సవాలను వైభవంగా నిర్వహించామన్నారు. వెంకయ్యయస్వామి కుటుంబ సభ్యులన్ని చెప్పుకునేవారికి మర్యాద పుర్వకంగా దర్శిన ఏర్పాట్లు చేసి గౌరవించడం జరిగిందన్నారు. తనపై అలయ ఏర్పాట్లుపై చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలను పేర్కొన్నారు. గొలగమూడిలో జైపూర్ పుట్ పరికరాలువికలాంగులకు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అశ్రమ పాఠశాల వద్ద ఉచితంగా విద్య వసతి సౌకర్యాలు ఏర్పాటు చేసి కార్పోరేట్ పాఠశాలకు తీటుగా విద్యను అందిస్తున్నామన్నారు

## సిఐ గంగాధర్‌కు ప్రత్యేక రివార్డు



**ఆత్మకూరు, ఆగస్ట్ 27 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఓ గంజాయి స్మగ్లర్‌ను చేజింగ్‌చేస్తూ వృత్తి ధర్మంకోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి గాయపడి కూడా స్మగ్లర్‌ను తమ సిబ్బందితో కలిసి పట్టుకున్న ఆత్మకూరు సిఐ జి.గంగాధర్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ ప్రశంసా రివార్డును జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అందించారు. గంజాయి రవాణా చేస్తూ పారిపోతుండగా అతని వెంటపడి చేజింగ్ చేస్తూ మర్రిపాడు వద్ద చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐలు ముత్యాలరావ్, విశ్వనాధరెడ్డి , హెడ్‌కానిస్టేబుల్‌కు , కానిస్టేబుల్స్‌కు ప్రశంసాపత్రాలు , రివార్డులు అందజేశారు.

## వైభవంగా అభయాంజనేయస్వామి వారి గ్రామోత్సవం



సంగం ఆగష్టు 27 ప్రభాతవార్త సంగం మండలం దువ్వూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాలను అత్యంత వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని వారిని దర్శించుకున్నారు.

## కమనీయం రుక్మిణీ,సత్యభామ సమేత శ్రీకృష్ణ కళ్యాణం



**జలదంకి, ఆగష్ట్ 27, ప్రభాతవార్త:** ఈనింగి, నేల కానందం కోపాలకృష్ణ కళ్యాణం అంటు అర్చకస్వాములు శ్రీకృష్ణుని కళ్యాణ ఘట్టం గూర్చి వివరి స్తుంటే భక్తులు తన్మయత్నంలో మునిగిపో యారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగ మంగళవారం జలదంకి శ్రీకృష్ణుని ఆలయంలో శ్రీరుక్మిణిసత్యభామ సమేత శ్రీకృష్ణుని కళ్యాణం కమనీయంగ సాగింది. ఈపుణ్య కార్య విశిష్టత స్వామివారి తంతును వేదపండితులు కళ్ళకు కట్టినట్లువివరించారు. మెరిసెను రుక్మిణమ్మ, మురిసెను సత్యభామ నడిమధ్య చేరి నిలిచెను అందాల నందనందనుడు అన్న కీర్తన వారి నోట జాలువారుతుంటే ఆహుతులు మంత్రముగ్దులైనారు. ఈకళ్యాణ మహోత్సవంలో భాగంగ ముందుగ విశ్వక్‌సేన ఆరాధన, పుణ్యాహవచనం, మండపారాధనరక్షాబంధన పూజ వంటివి భక్తిశ్రద్దలతో నిర్వహించారు. కళ్యాణవేదిక ముందు భాగంలో పీటలపై ఉభయకర్తలు నూకసాని మురళీకృష్ణ దంపతులుకుట్టుబోయిన రవికుమార్ దంపతులు ఆశీనులయ్యారు. ఈసందర్బంగ ఆలయ ప్రాంగణం శ్రీకృష్ణ పరమాత్మకీజై అన్న నినాదాలు మిన్నంటాయిమధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రి వేళ గ్రామోత్సవం కన్నుల పండుగగ సాగింది. గ్రామ వీధులవెంట స్వామివారికి భక్తులు కాయాకర్పూరం సమర్పించారు. రాత్రివేళ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈసందర్బంగ ఎలాంటి ఆటంకాలుకలుగకుండ నిర్వాహకులు మర్రిబోయిన నాగేశ్వరరావు, యానాదులు, దేవనబోయిన కొండస్వాములు, కుట్టుబోయిన తిరుపాలు, వెంకట్‌రావు, పెద మాలకొండయ్య, కమతం కోటేశ్వరరావు, కుట్టుబోయిన మోహన్, వెంకటరమణయ్య, కోటేశ్వరరావు సుబ్బారావులతో కూడిన బృందం గట్టి చర్యలు తీసుకొని అందరి ప్రశంశ లందుకున్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై మరింత అవగాహన అవసరం




**కోవూరు , ఆగష్టు 27 ప్రభాతవార్త :** సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత యుగంలో యూనిటీ 3డీ వంటి టూల్స్ వాడి విద్యార్థులు ఆధునిక గేమ్ డిజైన్ సాంకేతికతలను నేర్చుకోవడం వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సందీప్‌కుమార్ తెలిపారు. కోవూరు మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన యూనిటీ 3డీ గేమ్ డిజైన్ వర్క్‌షాప్ మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులు గేమ్ డెవలప్‌మెంట్ రంగంలో కొత్త ట్రెండ్స్ సాంకేతికతపై అవగాహన పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా గేమ్ డిజైన్‌లో ఉన్న ఆవిష్కరణలను నేర్చుకోవడానికి ఎంతో దోహదపడతాయన్నారు. సాంకేతిక అంశంపై ఇంజనీరింగ్ విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే ఈ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందని సీఎస్ఈ విభాగాధిపతి టి. సాయిప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ఎస్ఎస్‌డీసీ సహకారంతో ఈ వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందని కార్యక్రమ సమన్వయకర్త వి. చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, ప్రోగ్రామ్ డీన్ చక్రపాణి, అధ్యాపకులు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగష్టు 27 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు సాంప్రదాయబద్దంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నాగవల్లి పత్రాలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, భక్తులు ఉన్నారు.

## తెలుగుగంగ కెనాల్ లోకలైజేషన్‌పై సమీక్ష



సైదాపురం, ఆగష్టు 27, ప్రభాతవార్త మండల కేంద్రమైన సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో తెలుగుగంగ కెనాల్ లోకలైజేషన్ మీద క్షేత్ర స్థాయిలో పరిశీలించుటకు వ్యవసాయ సహాయకులకు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉన్న తెలుగుగంగ కాలువకు సంబంధించి 2ఏ, 2బీ బ్రాంచ్ కెనాల్ కింద ఎంత ఆయకట్టు ఉంది. రైతులు వినియోగించుకుంటున్న తెలుగుగంగ నీరు వాటికి నీటి పారుదల జరుగుతుందా లేదా అదే విధంగా ఆయకట్టుకు సంబంధించి సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, సర్వేయర్లు, వ్యవసాయ సహాయకులు సంయుక్తంగా పరిశీలించి జాయింట్ కలెక్టర్‌కు రోజువారి వివరాలను పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ ఏఈలు, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మారినా మారని అధికారుల తీరు



**చేజర్ల ఆగష్టు 27, ప్రభాతవార్త** ప్రస్తుతం ప్రభుత్వం మారినా అధికారులు తీరు మారలేద అనేందుకు ఇదోక ఉదాహరణ చేజర్ల మండలం కొలపనాయుడుపల్లి గ్రామంలో అక్రమాలకు పాలుపడిన ఐసిడిఎస్ ఉద్యోగికి జిల్లా ఐసిడిఎస్ పిడి వత్తాసు పలకడం ఏమిటిన సర్వత్రా చర్చేన్యాంశంగా ఉంది. దీనికి సంబందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐడిడిఎస్ సూపర్‌వైజర్‌గా ఆదూరుపల్లి సెక్టార్ పరిధిలో విధులలో ఉన్న యనమల సుబ్బరత్నమ్మ జిల్లా మైనింగ్ అధికారులను సైతం తప్పుదారిపట్టిస్తు ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటు మైనింగ్ స్టాక్‌పాయింట్ అనుమతి పొంది తెల్లరాయి అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వాస్తవానికి చేజర్ల మండలంలో ప్రభుత్వ అనుమతి పొందిన తెల్లరాయి తవ్వకాలు సాగిన దాఖలాలులేవు. అయినప్పటికి ఈ ప్రభుత్వ ఉద్యోగి తన స్టాకు పాయింట్‌లో 12 వందల టన్నుల తెల్లరాయి అక్రమ నిలువ వుంచి వున్నారు. జిల్లా మైనింగ్ అధికారులు తెల్లరాయి స్టాకు పాయింట్‌పై తనీఖీలు చేపట్టి వున్నారు. మైనింగ్ అధికారులు పలు పత్రికలలో వచ్చిన వార్త కధనాలకు గ్రామస్తుల పిర్యాదులకు స్పందించి విచారణ నిర్వహించి ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌పై చర్యలకు జిల్లా పిడికి నివేదించి ఉన్నారు. గ్రామస్తులు గత మూడు నెలలుగా ఈ ప్రభుత్వ ఉద్యోగి అక్రమ వ్యాపారంపై నిలదీస్తు, జిల్లా అధికారులకు. రాష్ట్రస్దాయి ఉన్నతాధికారులకు మైనింగ్, ఐసిడిఎస్ మంత్రులకు సైతం పిర్యాదు చేసి వున్నారు. ఈ ఫిర్యాదునేపద్యంలో రాష్ట్రస్దాయి అధికారులు తగు చర్యలకు జిల్లా పిడిని ఆదేశించినా పిడి స్పందించలేదని ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల సైతం బేఖాతారుచేస్తున్న పిడి వ్యవహారశైలిపై గ్రామస్తుల సంబందింత రాష్ట్రా ఉన్నతాధికారులకు, రాష్ట్ర మంత్రులకు పిర్యాదు చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది. గతప్రభుత్వంలో అధికారులు అక్రమాలు చూసిచూడనట్లు వ్యవహారించిన అధికారులు ప్రభుత్వం మారినా అదే ఒరవడిని కొనసాగించడం విస్మయం కలిగిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పిడి వ్యవహారశైలి ఇలాగే కొనసాగితే గ్రామస్తులు ,రాష్ట్ర ఉపముఖ్యమంత్రికి, ముఖ్యమంత్రికి నేరుగా వెళ్లి పిర్యాదు చేయాలని సంకల్పంతో ప్రమాణాళిలు సిద్దం చేసుకుంటున్నారని సమాచారం. ఈవిషయంపై జిల్లా ఐసిడిఎస్ పిడి హేమా సుజానాను మంగళవారం పత్రికా విలేఖర్లు వివరణ కోరగా ఇందుకు సంబందించి గుంటూరు డైరక్టర్ వారికి క్లారిఫికేషన్ పంపించడం జరిగిందని ఆమె తెలిపారు.

## సైదాపురం ఎస్సైను కలిసిన టీడీపీ నాయకులు



**సైదాపురం, ఆగష్టు 27, ప్రభాతవార్త** సైదాపురం మండలం నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎన్.కాంతికుమార్‌ను మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కీర్తిపాటి రాజశేఖర్‌రాజు, మండల టీడీపీ రైతు అధ్యక్షుడు కేపీ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. అదే విధంగా జనసేన మండల నాయకులు చింతలపూడి రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులు మగ్గం నవీన్‌కుమార్, జనసేన శ్రేణులు కూడా ఎస్సై కాంతికుమార్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.

## వక్ఫ్ చట్ట సవరణలు ఆపకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదు




**నెల్లూరు అర్బన్, ఆగష్టు 27, ప్రభాతవార్త :** వక్ఫ్ చట్ట సవరణలు ఆపకపోతే అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభహాన్ తెలిపారు. ఆవాజ్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని గాంధీ బొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు వక్ఫ్ బోర్డు చట్ట సవరణలను వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడకు వచ్చిన మైనారిటీలను ఉద్దేశించి ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎ సుభహాన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం గత 11 సంవత్సరాల నుంచి అభివృద్ధికి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. వక్ఫ్ చట్ట సవరణలతో మైనారిటీల అభివృద్ధి కోసమే ఈ చట్ట సవరణలు గొప్పలకు పోతున్నారని ఉన్న చట్టాలను అమలు చేస్తేచాలన్నారు. ఇప్పుడు కొత్తగా 40 చట్ట సవరణలు తీసుకుని వక్ఫ్ బోర్డుని నిర్వీర్యం చేయడం తప్ప ఇంకొకటి లేదన్నారు. మత స్వేచ్ఛకు ఈ చట్ట సవరణలు విగాతం కలిగిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు కూడా మైనారిటీలకు సమాధానం చెప్పవల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ ఇక్కడ ఉన్న రాజకీయ పార్టీలు కూడా చట్టసవరణలకు మద్దతు తెలిపితే కచ్చితంగా రాబోయే రోజుల్లో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఆవాజ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతామన్నారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ రఫీ మాట్లాడుతూ జిల్లాలో చాలా భూములు అన్ని ప్రాంతం అయి ఉన్నాయని వాటికి రక్షణ కంచెలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మైనారిటీ నాయకులు జియా ఉల్ హాక్ మాట్లాడుతూ పార్లమెంట్‌లో చట్ట సవరణు తక్షణం ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేసారు. జిల్లాలో అక్రమంలో చాలా ఉన్నాయి. వాటిని తక్షణ వక్ఫ్ అధికారులు స్వాధీన పరచుకోవాలని అన్నారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డును, వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ముస్లిం కర్తవ్యం అన్నారు. అనంతరం ఆవాజ్ ఆధ్వర్యంలో వక్ఫ్ చట్ట సరవణలు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎఒకి వినతి పత్రం అందించారు. ఆవాజ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. యజాన్, జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, షేక్ నజీర్ భాష, షేక్ నాయబ్, షేక్ మునీర్ భాష, మైనారిటీ నాయకులు నవీద్, మౌలానా అజీజ్, ఆసిఫ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం



**కోవూరు , ఆగష్టు 27 ప్రభాతవార్త :** వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఉన్న అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయని, ఆ వ్యవస్థలను గాడిలో పెట్టేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు అవినీతి అక్రమాలతో రాష్ట్ర ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని తమ ఖజానాకు మళ్లించుకున్నారన్నారు. ఈ కారణంగానే రాష్ట్రం అప్పుల కుప్పగా మారిపోయిందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు భూ దందాకు పాల్పడి బెదిరించి పేదల భూములు లాక్కున్నారన్నారు. వీటి కారణంగానే ప్రజలు వైసీపీని తరిమి కొట్టి గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమికి అత్యధిక మెజార్టీతో పట్టం కట్టారన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రాష్ట్రంను అరాచకం నుంచి అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేస్తూ ప్రజలకు రాజ్యాంగ బద్దంగా కల్పించిన హక్కులను కాపాడుతుందన్నారు. అధికారంలోని వచ్చిన 75 రోజుల్లోనే అమరావతి, పోలవరం ప్రాజెక్టు లాంటి పనులు తిరిగి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఉద్యోగస్తులకు, పెన్షన్‌దారులకు 1వ తేదీనే జీతాలు , పెన్షన్లు ఇస్తున్నారన్నారు. వైసీపీ నాయకుల భూ బాధితులకు న్యాయం చేయడం కోసం సెప్టెంబర్ 1వ తేది నుంచి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. కోవూరు నియోజకవర్గాన్ని క్లీన్ కోవూరుగా తీర్చిదిద్దడం కోసం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో వారి సొంత నిధులతో కాలువల పూడికలు తీస్తున్నారన్నారు. అదేవిధంగా జిల్లా మంత్రులు, ఎంపీ సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, విజయ్, మురళీకృష్ణారెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాసులు, శ్రీహరి, వేమయ్య, వెంకటేశ్వర్లు, భగవాన్, రమణయ్య, తదితరులు ఉన్నారు.

## కావలి మండల అభివృద్దికి కలిసికట్టుగా కృషి చేద్దాం



**కావలి రూరల్, ఆగస్టు 27 ప్రభాతవార్త** కావలి మండల అభివృద్ది కోసం అందరం కలిసికట్టుగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమా టి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలి మండల సాధారణ సర్వసభ్య సమావేశం కావలి ఎంపిడివో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి ఆలూరి కొండమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కావలి శాసనసభ్యులుగా ఎన్నికైన అనంతరం దగు మాటి వెంకట కృష్ణారెడ్డి తొలి సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రజా సమ స్యల పరిష్కారం కోసం సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలని కోరారు. మండలంలో జలజీవ న్‌మిషన్ ద్వారా మండలానికి 30 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులు మండలంలోని 17 పంచాయతీలలోని మంచినీటికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. 40 ఓవర్ హెడ్ ట్యాంకులకు ప్రతిపాదనలు కూడా పెట్టడం జరిగిందన్నారు. ఇవ్వన్ని పూర్తయితే మండలంలో మంచినీటి సమస్య వుండదన్నారు. మండలంలో ఇరిగేషన్‌పై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే అయినా సర్పంచ్ అయినా, జెడ్పీటీసీ, ఎంపిటిసిలు అయినా అందరు ప్రజాప్రతినిధులేనని ప్రజల చేత ఎన్నుకోబడిన వారేనన్నారు. గెలిచే వరకే వర్గాలు, పార్టీలు అని గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరు ప్రజా సమస్యల కోసం పాటుపడాలన్నారు. ప్రజాప్రతినిధులు మీమీ ప్రాంతాల్లో ఏ సమస్యలు వున్నా తీసుకురావాలని తెలిపారు. మనం వుండేది ప్రజల సమస్యలు తీర్చడానికేనన్నారు. రానున్నది వర్షాకాలం అయినందున చెరువు కట్టలు తెగిపోయినా ఇరిగేషన్‌కు సంబంధించి ఎటువంటి సమస్యలు వున్నా ఇరిగేషన్ అధికారులకు తెలియ జేయాలన్నారు. నీటిని కాపాడుకోవాలన్నారు. నీటి చుక్క కూడా సముద్రం పాలు కాకూడదన్నారు. కావలి మండల సాధారణ సర్వసభ్య సమావేశం గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సభ్యులపై వుందన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తప్పకుండా సమావేశంలో పాల్గొనాలన్నారు. అంతేకాని ఎవరు పడితే వారు సమావేశానికి హాజరై సభ గౌరవాన్ని తగ్గించవద్దన్నారు. సభ్యులు కాని వారు సర్వసభ్య సమావేశంలో కూర్చోవడం మంచి సంప్రదాయం కాదన్నారు. కేవలం ప్రజల చేత ఎన్నుకోబడిన వారు మాత్రమే హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన చేసిన పనులు, చేయబోయే పనులు, ప్రజలకు అందించిన సేవలు గురించి తెలియజేశారు. ఎంపిడివో ఎస్.శ్రీధర్‌బాబు, తహశీల్దార్ పి.శ్రావణ్‌కుమార్, డిఎల్‌డివో విజయ్‌కుమార్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, వైస్ ఎంపిపి అరగల కవిత, మండల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని బార్ అండ్ రెస్టారెంట్‌కు జరిమానా



నెల్లూరు ఆగష్టు 27 ప్రభాతవార్త నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ నిర్దేశించిన ప్రమాణాలు పాటించక, నిబంధనలు ఉల్లంఘించిన స్దానిక ఏసి సెంటర్‌లోని ఒక బార్ అండ్ రెస్టారెంట్‌కు ఐదువేల రూపాయలు జరిమానాను శానిటేషన్ అధికారులు మంగళవారం విధించారు. బార్ ఎదురుగా ఉన్న డివైడర్లపైలలో తాగిపడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ బాటి ల్స్‌ను సిబ్బంది ఆధ్వర్యంలో తొలగించారు. మరోసారి నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు.

## అర్చకుల వేతన పెంపు హర్షణీయం



**నెల్లూరు, ఆగష్టు 27, ప్రభాతవార్త- వైద్యం** అర్చకుల వేతనాన్ని రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచడం, దూపదీప నైవేద్యాలకు ఇచ్చే మొత్తం రూ.5వేల నుంచి రూ.10వేలకు పెంచడం హర్షించదగ్గ విషయమని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ తడకపల్లి సుధ రవీంద్ర పేర్కొన్నారు. అర్చకుల వేతనం పెంచిన రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలుపుతూ తడకపల్లి సుధా పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా సుధ మాట్లాడుతూ నిరుద్యోగ వేద విద్యార్దులకు నెలకు రూ.3వేలు భృతి, నాయిబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు ఉండేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేవాలయాల ట్రస్టు బోర్డులో అదనంగామరో ఇద్దరికి అవకాశం కల్పించడం దేవాలయ ఆస్తుల పరిరక్షణ కోసం, ఆధ్యాత్మిక పర్యాటకాభివృద్ది కోసం మంత్రులతో కమిటీలు ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణుల పక్షపాతి నారా చంద్రబాబునాయుడు అని మరోసారి నిరూపించారని అన్నారు.